# మనసున మనసై..!

**- మువ్వా శ్రీనివాస్**



"ఆ టీవీ కలా కళ్ళప్పగించి కూర్చున్నా వేంటే ... త్వరగా తెమలవే. అవతల నిన్ను చూడ్డానికి పెళ్ళివారొచ్చే వేళయింది" అంటూ రంగనాయకి హడావుడి చేసింది హాల్లోకొచ్చి.

పరిమళ మాత్రం తల్లి మాటలు పట్టించుకోలేదు. దాంతో రంగనాయకి విసురుగా కూతురు చేతిలోని రిమోట్ కంట్రోల్ లాక్కుని టీ. వీ. ఆఫ్ చేసింది.

'అబ్బా ! మంచి ఇంట్రెస్టింగ్ ప్రోగ్రామ్. ఎందు కాఫ్ చేశావ్ ? అయినా ఈ పెళ్ళి చూపు లన్నా-వాళ్ళ కోసం లేనిపోని హంగామా హడావుడి చేయడం అన్నా-నాకు భలే చిరాకు-జస్ట్ క్యాజువల్‌గా ఉండాలంతే" అంది మళ్ళీ టీ. వీ. ఆన్ చేస్తూ.

దాంతో తల మీద కొట్టుకుంటూ "నిన్ను మార్చడం నా వల్ల కాదే. ఒకటి మాత్రం గుర్తుంచుకో పరిమళా ! అబ్బాయితో పర్సనల్‌గా మాట్లాడాలంటూ లేనిపోనివన్నీ పెట్టమాకు. అందరిలా తలవంచుకుని చాపమీద కూర్చోవాలి. అంతేకానీ కుర్చీలో కూర్చుంటే తప్పేంటి ? అబ్బాయితో పర్సనల్‌గా మాట్లాడకపోతే అతని అభిరుచులు నా కెలా తెలుస్తాయి ? అంటూ ఆర్గుమెంటుకు దిగమాకు. ఇప్పటికే అరడజను మంది నిన్ను చూసెళ్ళి "ఈ అమ్మాయిని భరించడం మా వల్ల కాదు" అని చేతులెత్తేశారన్న విషయం గుర్తు తెచ్చుకో"

అంటూ అనుకోకుండా జారిన కనుకొనల్లోని చుక్కల్ని చీర కొంగుతో తుడుచుకుంటూ అప్పుడు చూసింది.

కారు దిగి లోపలికి వస్తున్నారు పెళ్ళి వారు !

అంతే ! రంగనాయకిలో కంగారు పెరిగి పోయి ఏం చేయాలో తోచక వాళ్ళను సాదరంగా ఆహ్వానించి కూతుర్ని లోపలకు రమ్మంది. కనీసం ముఖమన్నా కడుక్కుని పట్టు చీర కట్టుకుందువుగానంటూ.

కూతురు కదల్లేదు.

వచ్చిన అబ్బాయి... పేరు ఇంద్రలోక్. అలాగే కళ్ళార్పకుండా చూస్తుండిపోయాడు పరిమళ వైపు.

పరిమళ పెదాల్ని చిరునవ్వుల్తో తడిపి కోపాన్ని కనపడనీయకుండా కృత్రిమమైన సంతోషాన్ని ముఖం మీద అద్దిమూతిని సున్నాలా చుట్టుకుని కూర్చుంది.

"అమ్మాయి మహాలక్ష్మిలావుంది" అంది పెళ్ళి కొడుకు తల్లి పైకే...

ఆ మాటలకు పరిమళ ఫక్కున నవ్వింది. ఎందుకంటే స్నానం చేయకుండా జిడ్డుకారుతున్న ముఖంతో క్యాజువల్ వేరేతో ఉన్న తనని చూసి ఆమె అలా అనేసరికి నిజంగానే ఆమెకు నవ్వొచ్చింది.

అలా నవ్వుతున్న... అందంగా నవ్వుతున్న పరిమళ వైపు కళ్ళార్పకుండా అలాగే చూస్తుండిపోయాడు ఇంద్రలోక్.

నవ్వుతున్నప్పుడు పరిమళ మరీ అందంగా ఉంటుంది. సన్నని పెదాలు ఆమెవి. ఆ కొసల్ని బాగా పురిపెట్టి బిగించి కట్టినట్లు తిన్నగా ఉండక మెలికలు తిరిగి ఉంటాయి. అంతేకాదు. నవ్వుతున్నప్పుడు చివరల్లో సొట్టలు కనిపిస్తాయి.

వట్టప్పుడే చిరునవ్వుల్ని దాచుకోవడం తెలీదు పరిమళకు ! ఆమె పెదాలకు గిలిగింతలు కూసింత ఎక్కువే మరి !!

"ఐ యామ్ ఇంద్రలోక్. మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్ ?" అడిగాడు ఇంద్రలోక్.

కథ

"పరిమళ !" చెప్పింది పొడిగా పరిమళ ఎంత అందమైనదో ఆమె కంఠం కూడా అంతే అందమైంది. చిన్నప్పుడు తల్లిదండ్రులు బాగా ఏడిపించి ఆ కంఠాన్ని సానబెట్టినట్టున్నారు. అందుకే మాట్లాడేటప్పుడు ఆ మాటల వెనుక రాగం ఉన్నట్టనిపిస్తుంది. కోటి స్వరాల వీణా తంత్ర నినాదం బేక్ గ్రౌండ్ మ్యూజిక్‌లా వినిపిస్తున్న అనుభూతి కలుగుతుంది.

అలా నవ్వుతున్న తనవైపు కళ్ళార్పకుండా అలాగే చూస్తున్న ఇంద్రలోక్ వైపు అప్పుడు చూసింది పరిమళ... ఎట్ ఏ గ్లాన్స్ !

కానీ ఆ చూపు అలా కదలకుండా అలాగే స్థిరమై అతన్నే చూస్తుండిపోయింది. అంటే దీనర్థం ఇంద్రలోక్ కూడా తనలాగే అంత అందగాడా అని కాదు. అతనిలో ఏదో ఓ అనిర్వచనీయమైన ఆకర్షణ, దాన్నిమించి అతను అప్ కమింగ్ టీ. వీ. అండ్ ఫిల్మ్ ఆర్టిస్ట్!

అదే విషయం అడిగింది-"మీరు టీ. వీ. సీరియల్స్‌లో నటించారు కదూ !?" అంటూ-అంతేకాదు. కొన్నింటి పేర్లు కూడా చెప్పింది తను చూసినవి.

అతను ఎంతో హుందాగా తలూపాడు. రంగనాయకి 'అలాగా !?' అన్నట్టు ఆశ్చర్యంగా చూసింది అబ్బాయి వైపు-ఆమెకు టీ. వీ. అన్నా-అందులో వచ్చే కార్యక్రమాలన్నా ఎలర్జీ. అందుకే దాని జోలికి పోదు.

పరిమళ తనకు తెలియకుండానే ఆకర్షించబడింది ఇంద్రలోక్ చేత. అందుకే అతనితో పర్సనల్‌గా మాట్లాడాలనిపించింది. అతని అభిరుచులు తెలుసుకోవాలనిపించింది-అన్నీ నచ్చితే అతన్ని పెండ్లాడాలనిపించింది.



కానీ తల్లేమో ముందే వార్నింగ్ ఇచ్చింది -ఇలాంటి లేనిపోనివి పెట్టమాకూ అంటూ ! కేవలం ఒకర్నొకరు చూసుకుని కొన్ని నిమిషాల్లో 'అతను నాకు నచ్చాడు'-'ఈమె నాకు నచ్చింది' అని ఎలా చెప్పగలమని ?!

"మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడొచ్చా ?" అడిగాడు అనుకోకుండా ఇంద్రలోక్. అంతే ! ఆమెకు ఎంతగానో ఆనందమనిపించింది. మనసులోనే అతనికి కృతజ్ఞతలు చెప్పుకుంది.

తల్లి కళ్ళతోనే అంగీకారం తెలిపింది పరిమళ వైపు చూస్తూ. దాంతో పరిమళ పైకి లేచి బాల్కనీ వైపు నడిచింది. అతనూ, ఆమెనూ అనుసరించాడు.

"చూడు మిస్ పరిమళా ! నాకు మీరు బాగా నచ్చారు. మీ సింప్లిసిటీ అంతకన్నా నాకు బాగా నచ్చింది. ఇలా మీతో పర్సనల్‌గా మాట్లాడాలంటూ మీకు ఇబ్బందికలగజేస్తున్నందుకు క్షమించండి. ఇలా మాట్లాడాలని ఉంటే మీతో నా గురించీ, నా అలవాట్ల గురించీ, నా అభిరుచుల గురించీ మనసు విప్పి మాట్లాడాలనే ! ఓ వేళ నేను మనసు విప్పి మాట్లాడిన తరువాత కూడా మీరు నాతో పెళ్ళికి అంగీకరిస్తే నిజంగా మీలాంటి భర్త దొరకడం నా అదృష్టంగా భావిస్తాను" చెప్పుకుపోతున్నాడు ఇంద్రలోక్.

అప్పుడు అడ్డుపడింది పరిమళ. "మనసు విప్పి మాట్లాడిన తర్వాత కూడా పెళ్ళికి అంగీకరిస్తే ... అంటున్నారు. అంటే ఆల్రెడీ నేను మీతో పెళ్ళికి అంగీకారం తెలిపానా ? ... లేదే... !?"

"ఫేస్ రీడింగ్ నా హాబీ ! అందునా ఆడవాళ్ళ నోట్లో మాట ఎలా దాగదో ముఖంలో భావమూ అలానే దాగదు."

"గుడ్ ! డైలాగ్ చాలా బాగుంది. మొన్న మీరు యాక్ట్ చేసిన "ఆడవాళ్ళు జాగ్రత్త!" సీరియల్‌లోది కదూ ఈ డైలాగ్ ? "ఓకే ప్రొసీడ్ ?" అంటూ నవ్వేసింది పరిమళ.

దాంతో ఇంద్రలోక్ షాక్ తిని అలాగే చూస్తుండిపోయాడు.

"ఊఁ ! ప్రొసీడ్" అంది నవ్వడం ఆపి.

అప్పుడు కంటిన్యూ చేశాడు. సిగరెట్ వెలిగిస్తూ

"విత్ యువర్ పర్మిషన్... దిస్ సిగరెట్ !"

పరిమళ ఎంతో చికాకుగా చూసింది ఈ సిగరెట్ వైపు. అది గమనించిన ఇంద్రలోక్ వెంటనే ఆ సిగరెట్‌ను నోట్లోంచి తీసి కిందపడేశాడు.

"చూడు పరిమళా ! మీలాగే నాదీ చాలా ఫ్రాంక్ నేచర్. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే నాకు డ్రింక్స్ అలవాటుంది.
పార్టీల్లో-ఫ్రెండ్స్ బలవంతం చేస్తేనే కాదు. కనీసం వారానికోసారి తప్పనిసరిగా ఆల్కహోల్ తీసుకుంటాను. అలాగే నాకు ఇద్దరు ముగ్గురు గాళ్ ఫ్రెండ్స్ కూడా లేకపోలేదు. వాళ్ళు వాళ్ళకి బోర్ కొట్టినప్పుడల్లా నా దగ్గరకు వస్తుంటారు. వాళ్ళనే కాదు. మరో ముగ్గురు నలుగురు అమ్మాయిలతో నాకు సంబంధాలున్నాయి. రేపు మీతో పెళ్ళవగానే ఇవన్నీ మానుకుని ఒక్కసారిగా బుద్ధిమంతుడ్నయిపోవడం నావల్ల కాదు. వీటన్నింటికీ అంగీకరిస్తే వచ్చే నెల్లోనే మన పెళ్ళి ఫిక్స్ చేసుకోవచ్చు" అంటూ ఎంతో క్యాజువల్‌గా చెప్పాడు ఇంద్రలోక్.

"ఐసీ ! అలాగా ! చూడండి. ఇంద్రలోక్ గారూ ! అయితే నా గురించి కూడా నేను చెప్తాను. నాకు మీలా అంతమంది బాయ్ ఫ్రెండ్స్ లేరు కానీ ఒకే ఒక్కడున్నాడు. కాలం కలిసొస్తే ఇద్దరం మ్యారేజ్ చేసుకోవాల్సిన వాళ్ళం. కానీ పెళ్ళికి ముందే బాగా షికార్లు కొట్టి అన్నీ అనుభవించేసరికి ఒకరి మీద ఒకరికి మోహం మొత్తేసింది. వాడూ అంతే ! ఎప్పుడైనా బోరుకొట్టినప్పుడే వస్తుంటాడు-నా దగ్గరకు. మరి మీరు అభ్యంతరం పెట్టరు కదా-ఒకవేళ రేపు మన పెళ్ళయ్యాక వాడు మనింటికి వస్తే ?" అడిగింది సూటిగా చూస్తూ వస్తున్న నవ్వుని బలవంతాన ఆపుకుంటూ !

ఆమె అతన్ని ఏడిపించాలని అన్న



# అక్షయ్, శిల్ప విడిపోయార్ట!

ఇది కూడా వదంతేనేమో! ఇటీవల ట్వింకిల్‌ఖన్నాతో ఓ సినిమాలో నటిస్తున్న అక్కీ-అక్షయ్‌కుమార్ ముద్దుపేరు-శిల్పను పట్టించుకోవడం మానేశాట్ట. ఇలాగింకెంతమంది అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటాడని కొందరు గోల పెడుతున్నారు. అతన్ని గురించి బాగా తెలిసిన ఓ వ్యక్తి మాత్రం "అక్కీ నిజానికి ఎవరినీ ప్రేమించడు. అతను ఒక సెల్ఫ్ లవ్వింగ్ మ్యాన్. కనుక తన్ను తానే తప్ప ఇంకెవరినీ ప్రేమించే ప్రసక్తి లేనేలేదు!" అని వ్యంగ్యంగా అంటున్నాడు. శిల్పాశెట్టి "ఇలాగెందుకు వదంతులు దుమారంలా రేపుతారో, వీటివల్ల వారికి ఒరిగేదేమిటో నాకు మాత్రం అర్థం కావటం లేదు. నిజంగానే మేమిద్దరం విడిపోవాలని ఇంతమంది జనం కోరుకుంటున్నారన్నమాట!" అంటూంది నిర్ఘాంతపోతూ. బాగుందండీ వ్యవహారం!

మాటల్ని అతను మాత్రం సీరియస్‌గానే తీసుకున్నాడు. "చూడండి పరిమళగారూ ! ఈ విషయంలో నాకు ఎట్టి అభ్యంతరంలేదు. మీ కోసం ఎవరు వస్తున్నారు ? ఎందుకొస్తు న్నారు ? అని ఆలోచించే తీరిక నాకు లేదు. రోజులు మారిపోతున్నాయి. మారిపోతున్న రోజులకు అనుగుణంగా మనమూ మారాలి. ఇరవై ఒకటో శతాబ్దంలోకి అడుగుపెడుతున్న మనం ఇంకా శీలానికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వడం అనవసరం. సో... మీ బాయ్ ఫ్రెండ్స్ గురించి నాకనవసరం. నా గాళ్ ఫ్రెండ్స్ గురించి మీకనవసరం. అలాగే మీ శాలరీ కూడా మీ ఇష్టం. మీ రేమైనా చేసుకోండి. మీ సంపాదన గురించి నేను పట్టించుకోను. అలాగే నా సంపాదన గురించీ మీరు పట్టించుకోకూడదు. అబ్బా ! ఇప్పుడు నాకెంత ఆనందంగా ఉందో సరిగ్గా నా అభిరుచులు-నా అభిప్రాయాలు-అలవాట్లు లాంటివే ఉన్న ఓ అమ్మాయి నా జీవిత భాగస్వామి అవడం నిజంగా నా అదృష్టం పరిమళా !" అన్నాడు ఎంతో ఎమోషనల్‌గా ఇంద్రలోక్.

"హలో సర్ ! మీరు మరీ ఎమోషనల్ అయిపోయి యాక్టింగ్ చేసేయకండి. ఇది సినిమానో, టీ. వీ. సీరియలో కాదు... జస్ట్... ! జస్ట్ ... ! జీవితం ... నేను మీకు నచ్చొచ్చు. కానీ నాకు మీరు అస్సలు నచ్చలేదు. ఆ మాటకొస్తే నాకే కాదు. ఈ హోల్ ఇండియాలోనే ఒక్క అమ్మాయికీ నచ్చరు మీరు. ఇక పాశ్చాత్య దేశాల్లో ట్రై చేస్తే చేయండి. ఏమో మరి ! లూయిన్ స్కీ పుణ్యమా అని అక్కడ కూడా అమ్మాయిలు ఆ మధ్య శీలానికి ప్రాముఖ్యత ఇస్తున్నారని పత్రికల్లో చదివాను.

ఇక మీ సంపాదనతో మీరు, నా సంపాదనతో నేను బతకడానికీ అసలు పెళ్ళెందుకండీ ? మీ ఇష్టమొచ్చిన అమ్మాయిని మీరు, నేను మెచ్చే అబ్బాయిని నేనూ తెచ్చుకుని అనుభవిస్తూ పోతే మనముండేది సంసారుల ఇల్లు అవదు. ఓ లాడ్జింగ్‌లో డబుల్ రూమ్ అవుతుంది. ఓ వేళ మనిద్దరం పెళ్ళి చేసుకుని మీరు చెప్పినట్టు ఎవరి పంథాలో వాళ్ళు బతుకుతూపోతే మనల్ని భార్యాభర్తలనలేరు... రూమ్మేట్స్ అంటారు. దానికన్నా చెవిటి భర్త, గుడ్డి భార్యల వైవాహిక జీవితం బలంగా ఉంటుందేమో ! ట్వంటీ ఫస్ట్ సెంచరీలోకి వెళ్ళినా మన ఇండియన్ కల్చర్ కల్చరే సార్. ఇది మాత్రం మారదు. పెళ్ళంటే నిండు నూరేళ్ళు కలిసి బతకాల్సిన ఓ అమ్మాయి ఓ అబ్బాయిల జీవితాలను ముడివేయడం. అలా అమ్మాయి మెడలో అబ్బాయి వేసిన మూడు ముళ్ళతో ఒక్కటైన వారి జీవితాలు మూడు సూత్రాల ప్రాతిపదిక మీద జరుగుతుంది.



అదేమిటంటే-మనిద్దరం సుఖంగా ఉండాలి. మన సుఖం ఇతరులకి దుఃఖం కలిగించకూడదు. మన భవిష్యత్తు మనకు పుట్టే పిల్లలకు బంగారు భవిష్యత్తు కావాలి. ఇదీ సార్ పెళ్ళంటే !... అంతే కాదు. ఈ పెళ్ళి ద్వారా ఒకటైన భార్యాభర్తలు అప్పటి వరకూ వేరే వేరు జీవితాలు లాగినా పెళ్ళితో ఒకటై ఒకరి కోసం ఒకరై, ఒకరికి కష్టం వస్తే మరొకరు కదిలిపోతూ ఒకరి ఆనందం మరొకరు పాలుపంచుకుంటూ మనసున మనసై మమేకమైన మనసులతో జీవితాల్ని మహదానందంతో లాగుతారు.

పెళ్ళంటే... ఓ మంచి జీవిత భాగస్వామిని నీకు పెళ్ళి కానుకగా ఇచ్చేది. ఆ జీవిత భాగస్వామి నీలో సంతోషాలు పూయిస్తుంది. లాలిస్తుంది. పాలిస్తుంది. నవ్విస్తుంది. ఓదార్చుస్తుంది. భయంతో వెనకడుగు వేసినప్పుడు భుజం తడుతుంది. ధైర్యం చెబుతుంది. ముఖ్యంగా స్టైల్ ఆఫ్ లివింగ్ నేర్పుతుంది. జీవిత పరమార్థాన్ని తెలియజేస్తుంది. అంతేకానీ ఓ అమ్మాయి, అబ్బాయి రెండు తాళం చెవులు కొనుక్కుని ఒకే ఫ్లాట్ అద్దెకు తీసుకుని రూమ్మేట్స్‌లా కలిసి ఉండడం కాదు పెళ్ళంటే !" అని ఆవేశంగా చెప్పింది పరిమళ.

అక్కడ్నుంచి కదలబోతూ ఆమె వెనక్కి తిరిగి చెప్పింది. "అన్నట్లు ఇందాక నేను మీతో చెప్పినట్లుగా నాకు అసలు బాయ్ ఫ్రెండ్స్ లేరు. ఆడపిల్ల జీవితంలో స్నేహం చేసే ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్ బాయ్ ఫ్రెండ్ భర్తే కావాలి. ఆడపిల్ల తన హృదయంలో చోటిచ్చే వన్ అండ్ వోన్లీ లవర్ తన భర్త మాత్రమే కావాలి అని నమ్మే సగటు ఆడపిల్లను నేను."

ఇంద్రలోక్ చాలా వేగంగా వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళి కార్లో కూర్చున్నాడు. అతని మొహంలో చోటుచేసుకున్న భావాల్ని గమనించిన రంగనాయకికి అర్థమైపోయింది. 'ఈ సంబంధం కూడా క్యాన్సిల్' అని !

"పరిమళా ! నాకు మీరు కావాలి ! పెళ్ళంటూ చేసుకుంటే-పెళ్ళంటే ఏంటో తెలియజేసిన మిమ్మల్నే చేసుకుంటాను. ఇది నిజం ! మీకు తెలుసా ! నేను ఆల్కహాల్ పూర్తిగా మానేశాను. సిగరెట్టు కూడా తాగట్లేదు. ఇక అమ్మాయిలందరితో ఫ్రెండ్‌షిప్ కటీఫ్. నా మాటలు నమ్మండి. తప్పు చేసే వాడు తాను చేస్తున్న తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందిననాడు తిరిగి ఆ తప్పు ఎప్పటికీ చేయడు గాక చేయడు. 'భార్య అంటే ... బ్రతకడం ఎందుకో నేర్పే పంతులమ్మ...' అని నేనే ఓ డైలాగ్ ఏదో సీరియల్లో చెప్పాను. కానీ దీనర్థం మీతో ఆ రోజు మాట్లాడిన తర్వాత అర్థమైంది. నిజంగా మీరు కనుక నన్ను మ్యారేజ్ చేసుకోవడానికి ఇష్టపడితే ఈ ప్రపంచంలో నా అంత అదృష్టవంతుడు మరొకడు ఉండడు...

అవతల్నుంచి ఫోన్లో ఇంద్రలోక్ మాటలు వినిపిస్తుంటే ఎంతో ఆసక్తిగా వింటున్న పరిమళను అప్పుడే హాల్లో కొచ్చిన ఆమె తల్లి రంగనాయకి అడిగింది. "ఎవరి దగ్గర్నించీ ఫోను ? అయినా ఆదివారాలన్నా కాస్త మంచి చీర కట్టుకుని శుభ్రంగా అందంగా అలంకరించుకోరాదే ! ఎవరో ఒకళ్ళు వస్తున్నారు కదా నిన్ను చూడ్డానికి ?".

అప్పుడు అందంగా నవ్వుతూ అంది ఆ అందమైన అమ్మాయి ఇలా అందంగా-"ఇక నన్ను చూసుకోవడానికి ఎవరూ రానక్కర్లేదు !"



## రీతూశివపురికి చెంపదెబ్బ!

మన తెలుగు చిత్రం 'దొంగాట'లో చేసిన రీతూశివపురి గుర్తుందా? ఆమెను ఓ షో నిర్వాహకుడు కొట్టాడని బాలీవుడ్ అట్టుడికినట్టుడుకుతూంది. అతని పేరు దినేశ్‌ఆనంద్. యుఎస్‌కు వెళుతున్న ఎయిర్‌బస్‌లో రీతు కొన్న మిల్క్ షేక్ నేలమీద పడిందట. ఎవరో రీతును ఎందుకిలా జరిగిందని అడిగితే నానామాటలూ అని, పైగా అసభ్యకరంగా తిట్టిందట కూడా. అదీ ఎలాగంటే దినేశ్ కూతుళ్లు బాగుపడరనీ, ఇంకా ఏవేవోనట. దాంతో ఒళ్లు మండిన దినేశ్ అందరిముందూ రీతుని చాచిపెట్టి లెంపకాయ కొట్టాడట. దానికి రీతు ఏమంటూందంటే, "నేనతన్ని తిట్టలేదు. నాకసలు అతనికి కూతుళ్లున్నారన్న సంగతే తెలీదు, మరెలా తిట్టానంటాడు? కాకపోయినా కాస్త పేరు రావాలంటే మా సినీతారలను గురించి ఏదో రాయించడం, తద్వారా పబ్లిసిటీ సంపాదించటం ఇక్కడి వారందరికీ మామూలే!!" అని. మరీ ఇంత ఇదిగానా?